# సముద్రం పొంగింది

'శార్వాణి'

మబ్బుల్లోనుంచి జారిన వెన్నెలంతా ఇసుకమీద పాకిపోయింది. సముద్రంలోనుంచి ఉవ్వెత్తుగా లేస్తున్న తరంగాలు దరిని తాకి వెనక్కి ముడుచుకుపోతున్నాయి. మెత్తని మలయ పవనాలు చంపలను స్పృశించి జీవితలోతుల్లోని మధుర స్మృతులను వెతికి తీసుకువచ్చి మనస్సును పెనవేసుకుంటున్నాయి. ఒక చల్లని వెన్నెల రేఖ చాలు, తన హృదయంలోని భావనను తడపి మెరపు ముందు నిలబెట్టడానికి; ఒక సన్నని అలచాలు, తన ఆశలను గడిపి మనస్సును ముద్దచేయడానికి. ఒక చిన్న గాలి తెరచాలు_ఆలోచనలు మేల్కొల్పి, వంటినిండా చక్కిలిగింతలు పెట్టి పులకరింప చేయడానికి. ఎంతసేపు అలా కూర్చుంటే తను సాధించదలుచుకున్నది పొందగలుగుతుందా క్షణకాలం వెన్నెల కెరటం ... గాలి తెర యివన్ని తన ఆలోచనలచుట్టూ చేరి ఏదో మత్తత, మమత, ఎందుకు కల్గించాలి? ఒంటరిగా ఉంటే మాత్రం వర్షపుజల్లు పడకూడదని ఏక్కడవుంది? వాన భయంకరమైన ఉరుములతో, మిరిమిట్లు గొలిపె మెరపులతో వస్తే భయంగానే ఉంటుంది. తుప్పరపడుతూంటే చినుకులు క్రిందపడి నడచి పోవాలనిపిస్తోంది. సముద్రతీరంలోకి వెళ్లిన తర్వాత కుచ్చిళ్లు పైకెగదోసి, పాదాలను లహరితో తడపాలనివుండదా!

"ఈనీటిలోని పాదాలు ఎలా మెరుస్తున్నాయో!" తనతడిసిన పాదాలవంక చూస్తూ సముద్రం వంక చూడకుండా నిలబడిన నారాయణ ఎందుకనాలి?

"వాటినితాకి కెరటాలు ఏమి ఆనందాన్ని అందుకొందామని?"

అతనికి తెలియకుండా అడగుతున్నాడనా కావాలని కొంతమంది కొన్నిసందేహాలు తెచ్చుకుంటారు. వాటికి సమాధానములు వాళ్లే వేసుకొని తృప్తిపడితే ఎంతో బావుంటుంది."

"సముద్రంలో ఉత్పన్నమవుతున్న అలలు ఎంత అదృష్టవంతులనుకున్నావు."

అతనెందుకు నిరాశ పడాలి! అప్పుడే తన ఆశలన్నీ నిరాశలయ్యేనా!

"నీవు మాత్రం అదృష్ట వంతుడవు — ఎందుకు కాకూడదు" ఒక్క మాట చాలు - ఎగిరి రోదసీకుహరంలోని తారలను అందుకోడానికి.

అనలేదు

పాపం! ఆరోజు అతను ఎంతబాధపడ్డాడో! హృదయం వేదనతో కుంచుక పోయిందని తన కనికరంతో ఆవేదనకు సమయింప చేయమని తర్వాత కోరాడు.

కోపం వచ్చింది.

"మానవత్వంలో బలహీనతను ఎందుకంత వేగంగా బహిర్గతం చేయాలి!" ఇలా అడిగితే అతను మరీ యిదయిపోతాడు. ఈ ప్రశ్నకు సమాధానము మరొకప్పుడైనా అతని ద్వారా నేరావాలి; అంత వరకు విషయాల్ని విస్మరించలేను.

ఈ సారి నాపెదాలు చాలా అందంగా ఉన్నాయని వర్ణించాడు. రెండు మూడు పుస్తకాల్లో వర్ణలను సంకలనం చేసి, కంఠంస్తంచేసి, తప్పులేకుండా అప్పచెప్పాడు.

నవ్వొచ్చింది.

"నీకు తెలియని అందం నీదగ్గరవుంటే అట్లానే నవ్వుతావు. ఆ నవ్వులో ఎంతో అందం వుందన్న సంగతికూడా నీకు తెలియదు."

ఇటువంటి మాటలతో అతడు ఏమౌన్నత్యాన్ని పొందాలనుకుంటున్నాడో స్పష్టంగా తెలియచేయనివ్వడు.

తను వుంటున్న భవనం బ్రహ్మాండంగా వుండం టాడు.

ఆ భవనం ముందు ఎన్నో రకాల పువ్వుల మొక్కలున్నాయట.

"పారిజాతాలు బాగా విచ్చి పరిమళాన్ని వెద జల్లుతున్నాయి. నీరాకకోసం వేయికళ్ళతో ఎదురు చూస్తున్నాయి" అసహజంగా మాటలు వత్తి పలుకుతాడు.

నా కీవర్ణనలంటే వొళ్ళుమంట.

కారు మొన్ననే మార్చాడట. తనకు ప్రమోషను వచ్చిందట. తన అంతస్తు పెరిగిందట.

ఇవన్నీ ఎందుకు చెప్పుకోవడం! పరిస్థితులలో అతనికి జరుగుతున్న మార్పులు కన్పించకుండా వున్నాయనా!

క్రొత్తకారు కన్పిస్తుందిగా.

ఎందుకు చెప్పుకోవాలి.

అడిగితే మధన పడతాడు. అడకుండా వూరు కుంటే, చెప్పడం మానడు.

ఒక రోజున వర్షం బాగా కురుస్తే బయటకు వెళ్ళ బుద్ధివేయలేదు. పైన ముందుగదిలో తలుపులు తెరుచుకొని కూర్చున్నాను. పల్చబడుతున్న మేఘాలను చూస్తూ అర్థంలేని మనుష్యులను మరచిపోతున్నాను.

"రాధా"! మెట్ల మీదనుంచి శబ్దం. ఉలిక్కి పడ్డాను. గబుక్కున వెనక్కి తిరిగి చూస్తే విలువైన దుస్తులతో నారాయణ పైకివచ్చాడు. కుర్చీ చూపించాను. కూర్చున్నాడు.

"మీ ఏకాంతాన్ని చెదిపి, ఆలోచనలను కదిపి నందుకు క్షమించమని కోరుతున్నాను."

ఇటువంటి క్షమాపణలు మామూలే! అంచేత ప్రత్యేకత ఏమి చూపించ నవసరము లేదు.

"ఇందులోమీరు చేసినపెద్ద పొరపాటేమి కన్పించ దంలేదు. ఎందుకు క్షమించమని కోరుతున్నారో నాకు బోధపడడంలేదు."

నవ్వుతూనే మెల్లగా అనాలనే అన్నాను. అతని దగ్గిరనుండి తిరిగి సమాధానమురాలేదు. రాదుకూడా.

"ప్రతి చిన్న విషయానికి క్షమించమని అడిగే వాళ్ళను చూస్తే, నాకు బలే అసహ్యం వేస్తుంది. నే నీ విధంగా అంటున్నాని మీకు కోపంరావచ్చును అయినా నేను క్షమించమని అడగను."

చిరాకుగా అనేసి మెదలకుండా కూర్చుండి పోయాను.

"మీరు కోపంగా ఉన్నా, చాలా అందంగా వుంటారు-ఎందుకంటారు?"

బలవంతంగా నవ్వును పెదాలమీదికి లాక్కొని అని ఉంటాడు.

"నేను జుట్టు గొరిగించుకొన్నా, కళ్ళుపీక్కొన్నా చేతులు విరగగొట్టుకున్నా అందగానే వున్నానంటారు. అవునా! మగవాళ్ళంతా యింతే!"

ఈ సారి అతడు తెల్లబోయాడు. సమాధానం కోసం వెతుక్కుంటూన్నాడు.

"ఏదైనా మనం అనుకోటంలోవుంది. ఇష్టంగా ఉంటే అసహ్యంగావున్న గౌరవిస్తారు. కష్టంగా ఉంటే అందాన్నిగూడా అవతలకు నెట్టివేస్తారు."

నా మాటలు శ్రద్ధగా ఆలకిస్తూ కూర్చున్నాడు ఇహ చేసేదేమీ లేక.

"మీతో వాదించటం నాకు చేతగాదు, ఒకవేళ వాదించ దలుచుకుంటే నన్ను నేను గెలుపొందటం కంటే ఓడిపోవడమే శ్రేయస్కరం!" అతి కష్టం మీద పెదవులు కదిలించి అన్నాడు.

"ఎందుకంత పేలవంగా మాట్లాడుతారు. నిజాన్ని తెలుసుకోవడం కోసం మీరెందుకు ఓడి పోవాలి! ఎవరికోసం యింతపెద్ద చదువులు చదివేరు?"

"ఉద్యోగంకోసం, సంపాదనకోసం"

"అంతేనా! ఏ విషయంలోనైనా నన్ను మీరు గెలవడానికి ప్రయత్నం చేయడానికి చూడండి. కాని మాటలతో నన్ను జయించలేనని నీరసంగా మాత్రం మాట్లాడవద్దు."

బయట వర్షంవెలిసింది. లేచి నిలబడ్డాడు.?

"కాఫీ తీసుకోకుండా వెళ్తున్నారా?"

"త్రాగివచ్చాను" విసురుగా మెట్లుదిగి వెళ్లి పోయాడు. కారుకన్పించేవరకు చూచి కుర్చీలో కూల బడ్డాను. నన్ను తెగ పొగుడుతాడు. నా అందాన్ని వర్ణిస్తాడు. అసహ్యంగా కన్పించిననాడుకూడా పొగుడుతూనే ఉంటాడు. అతని వర్ణనల వెనుక

ఏదో స్వార్థం, అతని పొగడ్తల వెనుక ఏదో సంకుచితత్వం, ఎవరికీ తెలియదనుకుంటాడు.

నన్ను అభిలషించే మనుష్యులు కేవలం అతిథ్యాన్నే కోరుకుంటున్నారుగాని, గాంభీర్యాన్ని ఎందుకు వాంఛించరు? మానసిక తృప్తి పొందడం వాళ్ళకు చేతకాదా! స్త్రీ సాంగత్యాన్ని కోరుకోవడంలో ప్రాధాన్యత శారీరక సంతృప్తికోసమేనా? మానసిక విలువలు బోధపరచుకుంటే మగవాళ్ళంతా మానసిక వ్యభిచారం చేయరు. ఎంతకాలం మానవత్వానికి ఈ పతనం సాగేది?

భయమేసింది! నిలువెల్లునా వణికి పోయేను.

శ్రద్ధగా పరిశీలించి చూస్తే మానవుడు మృగం కంటే హీనంగా ఎందుకు ప్రవర్తిస్తున్నది, యిప్పుడు అవగతమవుతుంది. రెండు భిన్న లింగాలకు మధ్య తుచ్ఛమైన స్వభావాలు లేకపోతే చరిత్రకు హీనత వుండదు. మానవునికి పతనం వుండదు.

నారాయణకు ఇదంతా తెలియక ప్రవర్తిస్తున్నాడా? అతడు అన్నీ తెలిసే చేస్తున్నాడు. తెలిసి చేస్తున్న పాపాలకు, యిహంలోగాని, పరంలోగానీ విముక్తి వుండదు. పుణ్యంకోసమైన ఇంకోజన్మ ఎత్తలేడు.

బయటకు వెళ్ళడం ఎక్కువగా మానేశాను. ఇరువైనాలుగు గంటలు ఇంటిదగ్గర పడివుండటం విసుగ్గానేవుంది? బొత్తిగా ప్రొద్దుపోవడంలేదు. పూను పోవడంకోసం చిన్న ఉద్యోగానికి దరకాస్తు పెట్టేను. వేళా విశేషం ఎటువంటిదోగాని వెంటనే ఉద్యోగం వచ్చింది. మళ్లా మగవాళ్ళ మధ్య మసలాలి. అడుగు తీసి అడుగువేసే స్త్రీజీవితం కత్తిమీద సాము చేసినట్లే వుంది. చుట్టూవున్న మనుష్యులు పదునైన కత్తులు కాదుగదా! చెప్పడానికి వీల్లేదు. ఏ పుట్టలో ఏ పాముందో ఎవరు చెప్పగలరు! అన్ని పుట్టలలోని పాములు కాటువేయడానికి ప్రయత్నించేవేగాని, పడగవిప్పి నాట్యం చేసేవిగావు.

మొట్టమొదటి రోజు జాయినింగ్ రిపోర్టు ఇచ్చి నాకు ప్రత్యేకంగా కేటాయించబడిన కుర్చీలోవచ్చి కూర్చున్నాను. టేబుల్ నిండా కాగితాలు, ఫైల్సు చిందరవందరగాపడివున్నాయి. ఒక్కసారి సెక్షనంతా కలయచూశాను. ఎవరి పనులలో వారు సమగ్రంగా నిమగ్నులైనారు.

"వీళ్ళంతా కలాలు బ్రద్దలు కొట్టుకొని రెక్కలు ముక్కలయ్యేటట్లు ఎందుకు ఉద్యోగం చేస్తున్నట్లు?"

"బ్రతకడం కోసం!" ఇది నా ప్రశ్నకు జవాబు. అయితే నేను ఒప్పుకోను.

"నేను బ్రతకడంకోసం ఉద్యోగం చేయడంలేదు. కాలక్షేపణకోసం చేస్తున్నాను. అంటే వాళ్ళంతా నమ్ముతారా!"

"అంతా గుమాస్తాలు, చిన్న పెద్ద వారీగా వున్నారు. ఒక్కొక్కళ్లకి అరడజను పిల్లల చొప్పున వుండి వుంటారేమో?"

"పిల్లల్నికని వాళ్ళ పోషణకోసం ఆఫీసులలో అడ్డమైన చాకిరీ చేస్తున్నారు."

లోపల అనుకున్నందుకు ఎవరికీ బాధ వుండదు. ఒక్కొక్కరి మొహంలో జీవం కన్పించదు. వారు చేసే ప్రతిపని చాలా యాంత్రికంగా చేస్తున్నట్లు స్పష్టమవుతోంది.

కొన్ని రోజులుపోతే ...

కంపరమెత్తింది. ఒక్కరోజులోనే శ్మశాన వైరాగ్యం. రాజీనామా ఇచ్చేస్తే యింటిదగ్గర వీలు నామా వ్రాసుకోవచ్చును.

నా ఆలోచనలను చెల్లాచెదరుచేసి ఒక్క బక్క పాటి పొడుగుపాటి మనిషి నా టేబుల్ ముందు నిలబడ్డాడు. ఆ కళ్ళలోనికి చూశాను. కళ్లకు అద్దాలున్నాయి. ఆ కళ్ళవెనుక ఆశ, నిరాశ, విచారం, సంతోషం ఏమిద్యోతకమవుతున్నట్లు తోచదు.

ఫైల్సన్ని ఒకవైపుచేర్చి, కాగితాలన్ని కట్టగట్టి ఒక అరగంటసేపు నాకిచ్చిన వర్కు ఏ విధంగా చేయవలెనో వయనంగాచెప్పి, తన సీటులోనికి వెళ్ళిపోయాడు.

ఎందుకో అతనివంక చూడాలనిపించింది. అతనికి తెలియకుండా చూశాను. అతని టేబుల్ నిండా ఫైల్సే ఎత్తుగా పేర్చి ఉన్నాయి. దూరంనుంచి చూస్తే మనిషి కన్పించడు.

"అంత సన్నపాటిమనిషి యింతపని ఎట్లా చేయగలుగుతున్నాడో!" నాకున్నట్లుండి ఎక్కడలేని ఆశ్చర్యంవేసింది. అతనిలో ఏదో ప్రత్యేకత ఉన్నది. విచిత్రంగా కన్పిస్తాడు. ఎప్పుడూ బాధపడుతున్నట్లు కన్పిస్తూవున్న, ఎప్పుడు నవ్వుతూనే ఉంటాడు. సెక్షన్లో అందర్నీ చిరాకుగా ఉన్నప్పు

డెల్లా చమత్కారంగా మాట్లాడి నవ్విస్తూంటాడు. పనిలో నిమగ్నుడయ్యాడంటే ఒళ్ళు తెలియదు. చుట్టూవున్న మనుష్యుల్ని గుంభ్రంగా తిరుగుతున్న పరిస్థితుల్ని అతన్ని పోషిస్తూ పెంచుతున్న ఆహారాన్ని, అతనికి వయస్సు నందిస్తున్న అహర్నిశాలను అన్నీ మరచిపోతాడు.

కాన్ సంక్రేపను ఎక్కువ.

ఆఫీసుపని రెండు మూడు రోజులు క్రొత్తగా వున్నా అలవాటుపడిన తరువాత ఏమంత కష్టంగా లేదు.

ఒకరోజు ఐదుగంటలయిన తరువాత, అతని టేబులువద్దకువచ్చి నిలుచున్నాను. అందరు వున్నారు, పాపమా మానవుడు అదిరిపడ్డాడు.

"ఏం కావాలండీ!" మెల్లగా నా మొహం లోకి చూచి అన్నాడు.

"మీరు వ్రాసిన కథలన్నీ నాకు కావాలి! చదవాలనివుంది!"

"కథలు వ్రాస్తానని మీ కెలా తెలుసు!"

"ఊహించాను. మీకు తెలియదేమో నా ఊహలన్నీ నూటికి తొంభైతొమ్మిదిపాళ్ళు నిజాలు అవుతుంటాయి!"

"ఈ ఊహమాత్రం నిజంకాదు."

"మీకు నిజాన్ని చెప్పినా తెలుసుకోవడం చేత కాదు. మీరు వ్రాసిన "మట్టి ఆలోచనలు"లో సరిగ్గా నా భావాలే వ్రాశారు."

మిగతా గుమాస్తాలు మా సంభాషణ శ్రద్ధగా వింటున్నారు.

"కథలన్నీ తప్పకుండా రేపు తీసికొనిరండి!" అంతకంటె ఎక్కువగా అతన్ని విసిగించదలుచుకో లేదు. తర్వాత ఇంటికి వెళ్ళిపోయాను.

ఆ మరునటిరోజు ఆఫీసుకు వచ్చిన వెంటనే అతని సీటువైపు చూశాను. ఖాళీగావుంది.

సెలవు చీటీతోపాటు తన కథలన్నీ పంపించాడు. క్యాజువల్లీవు రిజిస్టరులో సెలవువ్రాసి పంపించాను. ఆ పని నాదికాకపోయినా అలా చేయడంలో నాకెందుకో తృప్తి అనిపించింది.

స్వల్పకాలంలోనే మా గురించి వింతగా చెప్పకోవడం విన్నాను. ఆఫీసునుంచి యింటికి వెళ్ళిపోతుంటే దారిలో నారాయణ ఎదురయ్యాడు.

"హల్లో! రాధా! చాలా మారిపోయావే! పూర్వంలాగా కన్పించడంలేదు." వికపు నవ్వు నవ్వి అన్నాడు.

"నేనేమీ మారలేదు. మీరు అనుకోవటంలో మారివుంటాను."

"మాటవరసకంటే మా కంపెనీలో మేనేజరు పోస్టు యిప్పించేవాడ్ని."

"థేంక్స్-మాటవరసకైనా మీరా మాత్రం అన్నందులకు మరీ థేంక్స్."

"ఈ మధ్య మీ గురించి తమాషాగా చెప్పకుంటూంటే విన్నాను నమ్మవచ్చునంటారా!"

-"నిజాన్ని మాత్రం నమ్మవద్దని అనడంలేదు."

అంతకంటే ఎక్కువగా మాట్లాడకుండా రిక్షా కట్టించుకొని వెళ్ళిపోయాను.

రాత్రి పక్క మీదకు వెళ్ళేముందు, కథలు తీసేను. అవన్నీ పూర్తిగా చదివేసరికి పన్నెండు దాటింది.

"అతనికి అతని కథలకు తేడాలేదు." సన్నగా నిట్టూర్చి కళ్ళు మూసేసరికి, ఎప్పుడు తెల్లవారిపోయిందో తెలియదు.

కాలకృత్యాలు ముగిసిన తర్వాత కాగితం కలం తీసుకున్నాను. ఇంతకుముందు నేనెవరికి ఉత్తరం వ్రాసి ఎరుగను.

రాజన్! నమస్సులు... మీ కథలన్నీ చదివాను. కథలో సంభవించిన ప్రతి సంఘటన మీ జీవితంలో అనుభూతిని గ్రహించగలాను. మీలో ఇంత మహత్తర శక్తి దాగివుందన్న, ఆ ఔన్నత్యంతో బుద్ధి నిర్మలతతో నన్ను ఆకర్షింప చేయగలిగారని అనుకుంటూంటే నా మనస్సు లజ్జతో కుంచించుకు పోతోంది. ఒక్కసారి మా యింటికివచ్చి మా ఆతిధ్యాన్ని స్వీకరిస్తారని ఆశిస్తూ మీకోసం ఎదురు చూస్తూంటాను."

రాధా

ఆఫీసులో స్వయంగా ఇవ్వలేదు. పోస్టులో పంపించాను. అతడు కవరు చించినప్పుడు నేను నా సీటులోనే కూర్చున్నాను. అతని చేతిలో ఆ వుత్తరం చాలాసేపు వుంటుందని, ఎన్నెన్నోసార్లు చదువు

కుంటాడని, ఎంతో ఆశ్చర్య పడతారని ఏ మేమో అనుకున్నాను. ముఖ కవళికలను బట్టి అదేమి ద్యోతక మవుట లేదు. నారాయణ అయితే పట్టపగ్గాలు లేక పోను. ఎగిరి గంతేసేవాడు.

సాయంత్రం ఎప్పుడవుతుందా అని వేయి కళ్ళతో ఎదురుచూస్తూ కూర్చున్నాను. టంచన్‌గా ఐదు గంటలు కొట్టేసరికి లేచి నించున్నాను

“ఏమండీ! మీ ఇంటికి వస్తున్నాను.” రాజన్ నుద్దేశించి ఆనేసరికి అతనేమి నిర్విణ్ణుడవ్వలేదు. మిగత గుమస్తాలకు అర్థంకాక తెల్లమొహాలు వేసుకొని, వాళ్ళలో వాళ్ళు సతమత మవుతున్నారు.

అతని వెంబడి నడుస్తున్నాను.

రెండు అంతస్తుల్లో జనం చీమల్లా ప్రాకి మా వేపు విచిత్రంగా చూడడం మొదలుపెట్టారు.

“వాళ్ళట్లా కళ్ళప్పగించి చూస్తూంటే మీ కేమైనా బాధగావుందా!” అతడేమంటాడో అని అడిగాను.

“నేనేమి తప్పుచేసేనని బాధపడాలి!” నాకు కావలసిన సమాధానమే వచ్చింది.

“స్త్రీ పురుషులకు ఒక్క శారీరక సంబంధమే గాని యింక ఎటువంటి సంబంధాలుండవా!”

“అల్ప సంస్కారులకు ఆత్మ ఔన్నత్యంలేని వాళ్ళకు ఒక్క శారీరక సంబంధంతప్ప యింకేమీ కన్పించదు. ఇటు చూడండీ మీతో ఇట్లా రెండు మూడు రోజులు తిరుగుతూంటే మన ఇద్దరిమధ్యనున్న సన్నిహితాన్ని చాలా అసహ్యంగా అర్థంచేసుకుంటారు.”

“తప్పంతా ఎవరదంటారు.”

“వాళ్ళకు మంచి దృష్టి లభించేవరకు, వాళ్ళ దృష్టికి యిమిడేటట్లు అనుగుణంగా ప్రవర్తించుకోవాలి. లేకపోతే మంచివాళ్ళుగూడా చెడ్డ వాళ్ళగానే చూడబడతారు.”

“మనలో కల్మషంలేనప్పుడు నటించటం దేనికని అడుగుతున్నాను.”

“మనం అనుకున్న మాత్రంలో ప్రయోజనంలేదు. మన సమాజం నిజాలను తెలుసుకోడానికి ప్రయత్నం చేయదు.”

“మీరు సమాజం అంటే భయపడతారన్నమాట”

“మన సమాజంచేసే పనులకు దేవుడే భయపడుతున్నాడు.”

“అయితే మీ కథలన్నీ నిష్ప్రయోజనమే!”

“సమాజం బాగుపడుతుందనే ఉద్దేశంతో వ్రాయడం మొదలుపెట్టాను. అది బాగుపడేవరకు వ్రాస్తూనే వుంటాను.”

“మీ సమాజం బాగుపడదు. బాగుపడటం నేర్చుకోదు.”

అతడు ఇంట్లోకి తీసుకొని వెళ్ళాడు. బిస్కట్లు, ఆపిల్ ముక్కలు, ద్రాక్షపళ్ళు తీసుకొనివచ్చాడు.

“నా వుత్తరం చూచుకొని ఏమనుకొన్నారు.”

“మీ రనుకున్నది మాత్రం అనుకోలేదు.”

“నేను అనుకున్నదికూడా మీకు తెలుసా!”

“దివ్యదృష్టికాదు, ఊహాగానం”

“మీరు కవులుగా, ఊహాగానం అవసరం.”

“సరి, ఇంతకు నా గురించి మీ అభిప్రాయం.”

“నాకేటువంటి అభిప్రాయం కల్గలేదు.”

“కలిగే అవకాశంవుందా!”

“చెప్పలేను.”

“మీతో ఇంత ధైర్యంగా వస్తున్నందుకు మీకు చాలా కోపంగా వుందనుకొంటాను.”

“ఉంటే ఇలా చేసేవాడ్నే కాను.”

“పోనీ నన్నే విధంగా అర్థంచేసుకొంటున్నారు.”

“నన్ను నేను అర్థంచేసుకోడానికి ప్రయత్నించను. అటువంటప్పుడు ఇతరులను అర్థంచేసుకొని, నేను ఏమిచేసుకోవాలో అర్థంకాకుండావుంది.”

“జీవితమంటే, మనుష్యులంటే ఎందుకంత అసహ్యం చూపుతారు.”

“అవన్నీ నిర్లక్ష్యం కనుక.”

“మీకు వివాహమయిందా.”

“లేదు.”

“లేకపోయినా పిల్లల తండ్రిలా కన్పిస్తారు.”

“అవి, చల్లారిపోతున్నాయి, తీసుకోండి.”

“పళ్ళు చల్లారిపోతాయా? మీ హాస్యం యిక్కడ కూడా వుంటుందన్నమాట.”

ద్రాక్షపళ్ళు తింటూ అతని ముఖంవంక పరీక్షగా చూశాను.

“చూడండీ మీ స్వల్పకాల పరిచయం, చాలా జీవితపు విలువల్ని నేర్పించింది. నిజమేనంటారా!”

“యదార్థమయితే అదృష్టవంతుడ్నే.”

“మీ రింతకాలం వివాహంచేసుకోకుండా ఎందుకున్నారు. కట్నాలు సరిగా రావడంలేదా!”

"నా వివాహం గురించి మీ రెండుళ్ళో చాలా శ్రద్ధ చూపుతున్నట్లున్నారు. మీకు వివాహ మయిందా!"

"లేదు."

"నన్ను చేసుకోడానికి మీకేమైనా అభ్యంత రమా!"

నాస్నేహపు తృళ్ళిపడి, సిగ్గుతో తలవంచేసు కున్నాను. అతడు ఎందుకు అంత ధైర్యంచేసి అన్నది, నాకు తెలియదనుకున్నాడు.

"నాకేమీ అభ్యంతరంలేదు."

"ఈ జన్మలో కాదు."

"అంటే ఈ జన్మలో మరొకరికోసం సర్వం త్యాగంచేశారనుకుంటాను. కౌసల్య మిమ్మల్ని మోసం చేసిందనుకుంటాను."

"నన్ను ఎవరు మోసంచేయలేదు. నా చేత నేను మోసంచేయబడ్డాను."

"కథలు వ్రాసేవాళ్ళంతా ఇట్లాగే మాట్లాడు తారు. కథలో ఒక సందర్భంలో ఇహ లోకంలో గాని పరలోకంలో గాని, వాంఛనీయమైనది కౌసల్య తప్ప నాకింకెవరు లేదన్నారు. జ్ఞాపకంవుందా!"

"అవన్నీ ఇప్పుడు జ్ఞాపకం చేయకండీ! ఈ జీవి తాన్ని తవ్వినకొలది కన్నీరుతప్ప కనకం దొరకదు."

"ఆ కన్నీటిలో నేవుంది జ్ఞానోదయాన్ని కల్గించే సత్యం."

"చాలా ప్రొద్దుపోయింది."

"వెళ్ళిపొమ్మని చెప్తున్నారా! మీ కంత కష్టంగావుంటే వెళ్తాలెండీ!"

"కౌసల్య అన్న మాటలు, మీ ప్రవర్తనచూస్తే మతికి వస్తున్నాయి. నావలన జరిగిన పరాజయాన్ని నా జీవితంలో, మరో వ్యక్తి ఈ జన్మలోనే తార సిల్లి తనలో కౌసల్యకు బదులుగా అంతర్లీనం చేసు కుంటుంది."

"ఆ వ్యక్తి ఎవరు?"

"మీకు తెలియకనే అడుగుతున్నా?"

"చెబుతేనే నోటి ముత్యాలు రాలి పోవులెండి."

"రాధా!"

"అర్ధంలేని అఘాతం వొద్దు."

నేను లేచి నిలబడ్డాను. పెరట్లోవున్న గులాబీ పువ్వును కోసి ఇచ్చారు.

"ఇవన్నీ ఎందుకు?"

"వట్టినే చెట్టుకుండలేక."

"వెనుక ఏదో కారణం వుంది."

"రాత్రంతా మీ మనస్సులో ఈ పూలు పలక రిస్తాయి."

"కలలో మీరు పలకరిస్తారు"

"అటువంటి గతికి నన్ను రానివ్వకండి."

"కలలో రాధ ప్రత్యక్షమైతే లేచి కూరి పేస్తారా".

"అది ఏమంత అసాధ్యమైన పనికాదు."

"చాలా ప్రొద్దుపోయింది. అమ్మ ఇంటి దగ్గర కనిపెట్టుకొని వుంటుంది."

లేచి ప్రయాణ మయ్యాను. అతడేమి అడ్డు పెట్ట లేదు. మా ఇద్దరి మధ్య సన్నిహితం ప్రబలంగా వస్తూంది. గిట్టనివాళ్లు మామీద చాలా దుష్ప్రచారం చేసి చాలా అసభ్యంగా ప్రవర్తించారు.

ఒకరోజు తీరుబడిగా కూర్చున్నాను. పేపరు పేజీలు త్రిప్పుతూ అకస్మాత్తుగా ఒకచోట ఆగి పోవలసి వచ్చింది.

నిన్న తెలవారు ఝామున రాజన్ కళేబరము మెరీనా బీచ్ ఒడ్డున దొరికిందని, పోలీసువారు దర్యాప్తు చేస్తున్నారని వుంది.

'రాజన్ ఎవ్వరు?' తృళ్ళిపడ్డాను. వళ్ళు తూలి పోయింది. మళ్ళా ఎప్పుడు తెప్పరిల్లానో నాకే తెలియదు.

ఒక అరగంట ముందే ఆఫీసుకు వచ్చి కూర్చు న్నాను. వచ్చిన గుమస్తా నెల్లా అడిగాను.

"మొహం ఆనవాలు పట్టలేనంత ఇదిగా వుందని, మన రాజన్ కాదని" ఎవరికు తోచింది వాళ్లు చెప్పారు.

ఆ రోజు రాజన్ ఆఫీసులోకి రాకపోయేసరికి ఆఫీసువాళ్ళంతా హాస్పిటల్ చుట్టూ మూగాము. వివరాలు ఏమైనా తెలుస్తాయేమో అని.

ఎవరూ ఆనవాలు పట్టలేక పోయారు.

నేను శవాన్ని చూసే స్థితిలోలేను. "అతను మాత్రం మన ఆఫీసులో పనిచేసే రాజన్ మాత్రం కాదు" అని అందరి అభిప్రాయం.

"అయితే రాజన్ ఏమయ్యేడు!"

ఆఫీసు మానివేసి యింటికివచ్చి ఎన్నిరోజులు ఆలోచించినా సమాధానం రాలేదు.

—(o)—